

సమాచారం లేక డిసిసిబి వేలం రద్దు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డిసిసి) కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటకు సంబంధించి పాటదారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం లేని కారణగా వేలం పాటను రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వేలంపాటకు సంబంధించిన వివరాలను డిసిసి బ్యాంక్ అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. మండపేటలోని విజయ మహాల్ ఎదురుగా ఉన్న ఎకరం 33 సెంట్ల స్థలం, అందులో ఉన్న భవనాలకు బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో 14 మంది పాల్గొనగా రూ.10 లక్షలు ధరావతుగా నిర్ణయించారు. సహకార అధికారి కె.కృష్ణ శృతి మాట్లాడుతూ పాటదారులు అడిగిన వివరాలతో మరో తేదీ నిర్ణయిస్తామని, ఈ వేలం పాట రద్దు చేస్తున్నామని చెప్పారు.

పల్లెల్లో అరకొర ఆరోగ్య సేవలు..

- కొనసాగుతున్న విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం
- పూర్తయినవి ప్రారంభం కాని వైనం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజల సంరక్షణ కోసం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం 45 రోజుల పాటు అట్టహాసంగా నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళుతున్న సిబ్బంది ప్రతి ఒక్కరికీ 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోనే సురక్ష క్యాంపులను నిర్వహించి వారికి కావలసిన వైద్య సహాయాన్ని అందిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణం విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శాశ్వత భవనాలను నిర్మించి నిరంతరం వీటి ద్వారా గ్రామాల్లోనే వైద్య సహాయం చేయాల్సి ఉన్నా నేటికీ ఏ ఒక్క గ్రామంలోనూ ఇవి పూర్తి కాలేదు. దీంతో పల్లెల్లో అరకొర వైద్య సేవలే దిక్కవుతున్నాయి.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా పల్లె ప్రాంత ప్రజలకు సర్కార్ వైద్యం మరింత చేరువకానుందని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో సాధ్యం కావడం లేదు. గ్రామీణ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దానిలో భాగంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పినా క్షేత్రస్థాయిలో నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయి. నిధులు కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 350 హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా 170 భవనాల నిర్మాణం చేపట్టారు. మిగిలినవి వివిధ కారణాలతో ప్రారంభం కాలేదు. స్థలాలు లభ్యం కాకపోవడం, స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ వివాదాల్లో ఉండడం, నిధుల కొరత, చేసిన పనులకు సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడం వంటి సమస్యలతో విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. నిర్మాణాలు వేగవంతంగా జరిపేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తుంది.




కాకినాడ రూరల్ వాకలపూడిలో పునాదిలోనే ఉన్న వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్

అందుబాటులోకి వస్తే...

ప్రతి 2,500 మంది జనాభాకు ఒక హెల్త్ క్లినిక్ నిర్మాణం చేస్తున్నారు. వీటి ద్వారానే గ్రామ పరిధిలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. చిన్న చిన్న ఇబ్బందులకు కూడా 10 కిలోమీటర్ల దూరంలో ఉండే పిహెచ్‌సికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండవు. ప్రతి క్లినిక్‌లోనూ బిఎస్‌సి నర్సింగ్ అర్హత కలిగిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ను నియమిస్తారు. ప్రస్తుతం ఉన్న ఎఎన్ఎంతోపాటు హెల్త్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు క్లినిక్‌లో ఉంటారు. కనీసం 90 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. అన్నిరకాల వ్యాక్సిన్లు దొరుకుతాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు టీకాలు వేయించుకునే అవకాశం ఉంటుంది.

సాగుతూనే ఉన్నాయి..

350 క్లినిక్‌లకు గానూ జిల్లాలో 170 నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఇంకా 180 భవనాల నిర్మాణాలు ఇంకా మొదలు కాలేదు. ఇప్పటివరకు కేవలం 33 మాత్రమే పూర్తయ్యాయి. 103 భవనాలు స్లాబులు వేసినట్టు అధికారులు తెలిపారు. 19 రూఫ్ లెవెన్‌లో, 15 ఫిజికల్‌గా పూర్తయ్యాయి. ఇలా జిల్లాలో అనేక భవనాలు మూడేళ్లుగా నిర్మాణ దశలోనే కొనసాగుతుండడంతో పల్లె ప్రజలు ఆరోగ్యానికి భరోసా కరువైందనే విమర్శలు వచ్చి పడుతున్నాయి. ఇంతకాలం గడుస్తున్నా నేటికీ ఒక భవనాన్ని కూడా ప్రారంభించలేదు. వీటి ద్వారా వైద్య సేవలు అందుతాయని భావించిన గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరాశే ఎదురవుతోంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా రక్షణ భేరి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కాకినాడ

సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రజా రక్షణ భేరి యాత్రలో భాగంగా నవంబర్ 5, 6 తేదీల్లో కాకినాడ జిల్లాలో జరిగే యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్.శ్రీనివాస్, జి.బేబిరాణిలతో కలిసి పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. బిజెపి బుల్డోజర్ రాజకీయాలతో అన్నదమ్ముల సమైక్యంగా మెలగవలసిన ప్రజల మధ్య కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్వేషాలను రాజేస్తోందన్నారు. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్రాలలో మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. స్త్రీలను నగ్నంగా నడిరోడ్డు మీద ఊరేగించి అదేదో తమ ఘనతగా మోడీ ప్రభుత్వం విర్రవీగుతోందన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు కావస్తున్నా విభజన హామీలైన ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామయ్యపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వే జోన్ ఏర్పాటు వంటి ఏ ఒక్క హామీలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అంతటితో ఆగకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తూ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కును తెగనమ్మటానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు నామమాత్రంగా తయారవడంతో కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారన్నారు. లక్షలాది ప్రభుత్వోద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షన్ విషయంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి జిపిఎస్ పేరుతో జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రజలు తమ కష్టం గురించి చెప్పుకోవాలంటే వినడానికి ముఖ్యమంత్రికి ఒక్కరోజు కూడా తీరిక లేదన్నారు. ఎంతసేపూ నవరత్నాల గురించి తప్ప పెరిగే ధరలు, నిరుద్యోగం, గిట్టుబాటు లేని వ్యవసాయం, రక్షణ కరువైన చేతివృత్తులు, కౌలురైతులు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. పైగా కరెంట్ ఛార్జీలు, ఇసుక ధరలు ప్రభుత్వమే పెంచిందన్నారు. నిరసనను కూడా తెలియజేయడానికి వీలు లేకుండా నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు, బైండోవర్ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇక ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయం గురించి పల్లెత్తుమాట అనకపోగా, పార్లమెంట్‌లో బిజెపిని బలపరుస్తోందన్నారు. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, రాష్ట్రాన్ని పూర్తిగా గాలికొదిలేశాయన్నారు. ప్రధాన పార్టీలు తమలో తాము అధికారం కోసం కుస్తీలు పడుతున్నాయన్నారు. ప్రమాదంలో పడిన మన రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలన్నా, సామాన్య ప్రజలకు నిజమైన ఊరట లభించాలన్నా ప్రజలే ఐక్యంగా కదలాలన్నారు. అప్పుడే కార్పొరేట్లకు రాష్ట్ర సంపదను కట్టబెట్టడంలో పోటీ పడుతున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో కలిసి ఆడుతున్న కపటనాటకానికి తెర దించగలమన్నారు. గతంలో విశాఖ ఉక్కు సాధన కోసం, ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేసినప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం, చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు బషీర్‌బాగ్ పోరాటంలో తెలుగువాడి సత్తా ఏమిటో చూపించామన్నారు. ఇప్పుడు మళ్లీ అటువంటి మహోద్యమం కోసమే సిపిఎం ప్రజారక్షణ భేరి మోగిస్తోందన్నారు. అందరూ కదలి వస్తే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధిని సాధించేందుకు కలిసి రావాలని పిలుపు ఇచ్చారు.

టిడిపి, జనసేన పొత్తు అనైతికం

ప్రజాశక్తి-కాకినాడ

పేద వాడిని మరింత పేదవాడిగా ఉంచడమే లక్ష్యంగా టిడిపి జనసేన పొత్తు ఉందని, టిడిపి జనసేన పార్టీల పొత్తు అనైతికమని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ జైలు నుంచి చంద్రబాబు నాటకాలు రచిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ నెల 26 నుండి వైసిపి సైన్యం సామాజిక న్యాయ బస్సు యాత్రకు బయలుదేరుతుందని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడుగా చెప్పుకోవడం తప్ప అచ్చెన్నాయుడును లోకేశ్ పక్కకు నెట్టేస్తున్నారని ఆరోపించారు. బిసిలు అంటే లోకేష్‌కు చులకన భావం ఉందన్నారు. 2019లో నారాసుర వధ జరిగిందని తెలిపారు. ఎన్టీఆర్ మానసిక క్షోభకి చంద్రబాబు ఎంత కారణమో భువనేశ్వరి తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు ఇబ్బందుల్లో ఉన్నాడని పురందేశ్వరి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ఎవరికైనా సాయం చేశారా అనిపురుందేశ్వరి విమర్శలు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

'ఎంఎల్‌ఎ ప్రసాద్ వల్ల వైసిపికి నష్టం'

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత ప్రసాద్ వల్ల వైసిపి తీవ్ర నష్టం చవి చూడాల్సి వస్తోందని మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని మర్రివీడు గ్రామంలో వైసిపి నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని అవినీతి ప్రస్తుత ఎంఎల్ఎ పర్వత హయాంలో చోటు చేసుకుందన్నారు. ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా ఎంఎల్ఎ పర్వత ప్రసాద్ చేసిన అవినీతి చిట్టా ప్రజలకు వివరించి ఆయనకు టికెట్ రాకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి ఎంపిపి గంగుమళ్ల వెంకటలక్ష్మి, వైసిపి సీనియర్ నాయకులు వాసిరెడ్డి జమీలు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు ఉన్నారు.

చంద్రబాబు కోసం తిరుపతికి బైకు యాత్ర


తాళ్లరేవు : టిడిపి అధినేత చంద్రబాబు కోసం తాళ్ళరేవు నుండి తిరుపతి బైకు యాత్ర చేపట్టారు పార్టీ స్థానిక కార్యకర్తలు. మండలంలోని పాతకోరంగి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు జవ్వాది తాతాజీ, చంద్రాల ఆదినారాయణ చేపట్టిన ఈ మోటార్ సైకిల్ యాత్రను టిడిపి ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాట్ల సుబ్బరాజు జెండా ఊపి ప్రారంభించారు.

'అరాచక పాలనపై పోరాటం'

ప్రజాశక్తి-కాకినాడ

వైసిపి అరాచక పాలనపై పోరాటమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన పార్టీలు పని చేస్తాయని ఆ పార్టీల నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక హోటల్లో జనసేన పార్టీ సిటీ ఇన్‌ఛార్జి ముత్తా శశిధర్, పెద్దాపురం ఇన్‌ఛార్జి తుమ్మల బాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ సిటీ ఇన్‌ఛార్జి వనమాడి కొండబాబు మాట్లాడారు. తమ నాయకుడు చంద్రబాబు అక్రమ అరెస్టుకు ముందే జనసేన, టిడిపి కలిసి అరాచక పాలనపై పోరాటం చేస్తామని చెప్పామన్నారు. ఈ లోగా చంద్రబాబును అక్రమ నిర్బంధం చేశారని వెంటనే జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం ప్రకటించి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా జనసేన, టిడిపి, కలిసి పోరాడాలని పిలుపునిచ్చారన్నారు. ఈ పిలుపు మేరకు సోమవారం పవన్ కల్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ రాజమహేంద్రవరంలో మొదటి సమావేశం నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారని దానికి అనుగుణంగా ఈ నెల 29న కాకినాడ వేదికగా సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన రెండు పార్టీలకు చెందిన నాయకులు అందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి సిటీ అధ్యక్షుడు మళ్లిపూడి వీరు, జనసేన నాయకులు తలాటం సత్య ఉన్నారు.

కార్టూ'నిజం'



బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల కోసం ఎదురు చూడ్డం మానేశారయ్యా.. ప్రస్తుతం అప్పుల కోసమే ఎదురు చూస్తున్నారు..!!

కబ్జా నుంచి పాఠశాల స్థలాన్ని కాపాడాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులాపల్లి ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన పాఠశాల స్థలం కబ్జాకు గురైందని స్థానికుడు ఈశ్వర్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న మూడు నుంచి నాలుగు సెంట్లు పాఠశాల స్థలం కబ్జాకు గురైందని ఈశ్వర్ రెడ్డి తెలిపారు. కబ్జాకు గురైన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, ఈ విషయమై పలుమార్లు తహశీల్దారు, ఎంపిడిఒ, ఆర్‌డిఒ పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. మూడేళ్ల నుంచి పోరాటం చేస్తున్నా ఎటువంటి ఫలితం లేదని వాపోయారు. దీనిపై నాగులపల్లి ఇన్‌ఛార్జి కార్యదర్శి వి.సత్యనారాయణ వివరణ కోరగా పాఠశాలకు సంబంధించిన స్థలాలు పంచాయతీ పరిధిలో ఉండవని తెలిపారు. గతంలో స్పందనలో ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టామని, పాఠశాలకు స్థలం ఇచ్చిన దాతలే నిర్మించుకున్నట్టు తెలిపారు. దీనిపై మళ్లీ విచారణ చేపడతామని చెప్పారు.

25 నుంచి ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు 9 ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, అప్డేట్ చేసుకోవడానికి మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేయడంతో పాటు బయోమెట్రిక్ అప్డేట్ (ఫోటో- ఐరిష్- వేలిముద్ర), పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు, చిరునామాలో మార్పులు వంటి సేవలను అందిస్తారన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

గొర్రిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -కరప

కరప మండలం గొర్రిపూడిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ కానూరు రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమమలో ఎంపిపి శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, చింత ఈశ్వరరావు, తహశీల్దారు పొన్నమండ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చీకాల సుబ్బారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పలు వైద్య సేవలను వివరించారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ నేత్ర వైద్యుడు అనసూరి నాగేశ్వరరావు 150 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 20 మందికి కంటి ఆపరేషన్లను అవసరాన్ని గుర్తించి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అలమండ దుర్గాప్రసాద్, జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, ఊర రాజబాబు, వి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సర్పంచ్ మహాలక్ష్మికి జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని కొత్త నాయకంపల్లి సర్పంచ్ మల్లిరెడ్డి మహాలక్ష్మి వరహాలు భర్త కాశి ఇటీవల మరణించడంతో మహాలక్ష్మి, ఆమె కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ బుధవారం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరి వెంట టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్ రావు, వైసిపి ఎంపిపి చలగళ్ల దొరబాబు తదితరులు ఉన్నారు

28న పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎజెండాలోని 14 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

సురక్షితంగా బాణసంచా విక్రయాలు

ప్రజాశక్తి-కాకినాడ

రానున్న దీపావళి పండుగను సురక్షితమైన వాతావరణంలో జరుపుకునేలా ప్రమాదాలకు తావులేని పటిష్టమైన ఏర్పాట్లు, జాగ్రత్తలతో బాణసంచా విక్రయాలను అనుమతించాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కోర్టు హాల్లో కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ వివిధ శాఖల అధికారులతో రానున్న నవంబరు 12న జరుపుకోనున్న దీపావళి పండుగ ఏర్పాట్ల పర్యవేక్షణపై ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వినాయక చవితి, దసరా పండుగలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా నిర్వహించామని, ఇందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చేపట్టిన చర్యలను ఆమె అభినందించారు. అదే స్ఫూర్తితో వచ్చే నెల 12న జరుపుకోనున్న దీపావళి పండుగ సందర్భంగా అన్ని ముందస్తు జాగ్రత్తలతో కూడిన పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆమె కోరారు. ఇందులో భాగంగా అనుమతి లేకుండా ఎవరూ బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలు నిర్వహించకుండా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలు నిశితమైన నిఘా, ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలన్నారు. అనుమతులు పొందిన కేంద్రాలు అన్ని ప్రామాణిక జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. దీపావళి పండుగ ముందు మూడు రోజులు పాటు మాత్రమే బాణసంచా విక్రయాలను, నిర్థిష్ట వేళల్లో అనుమతించాలని, ఇందుకు సురక్షితమైన, బహిరంగ ప్రదేశాలను ఈ నెల 30వ తేదీ లోపున గుర్తించి, తాత్కాలిక అనుమతులు జారీ చేయాలని సూచించారు. విక్రయ కేంద్రాల మధ్య దూరం, కేంద్రాల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్‌లు సులువుగా సంచరించేందుకు వీలుగా 6 మీటర్ల వెడల్పు మార్గం తప్పని సరిగా ఉండాలని సూచించారు. అన్ని విక్రయ కేంద్రాల వద్ద అగ్నిమాపక పరికరాలు, నీటి డ్రమ్ములు విధిగా ఉండేలా చూడాలన్నారు. పెంకు చిచ్చుబుడ్లు వంటి నిషేధిత బాణాసంచా ఐటమ్‌లను, శబ్ద, వాయు కాలుష్యం కలిగించే వస్తువులను విక్రయించకుండా పర్యవేక్షించాలన్నారు. బాణసంచా ధరలపై వాణిజ్యపన్నులు, లీగల్ మెట్రాలజీ అధికారులు ఎంఆర్‌పి ధరలు కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. విక్రేతలు పన్నులు ఎగవేయకుండా వాణిజ్య పన్నుల శాఖ వద్ద నమోదు పొందిన షాపులను మాత్రమే అనుమతించాలన్నారు. ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ బాణాసంచా అక్రమ తయారీ, నిల్వ కేంద్రాలను నిరోధించేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థ అవసరమన్నారు. ఇందుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలు వలంటీర్ వ్యవస్థ సహకారాన్ని ఉపయోగించుకోవచ్చునని సూచించారు. డిఆర్‌ఒ కె.శ్రీధరరెడ్డి, కాకినాడ ఆర్‌డిఒ ఈట్ల కిషోర్, కాకినాడ, పెద్దాపురం డిఎస్‌పిలు మురళీకృష్ణా రెడ్డి, కె.లతాకుమారి, జిల్లా అగ్నిమాపక అధికారి ఎన్.సురేంద్ర ఆనంద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ బి.సందీప్, డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పావని, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ సత్యకుమారి, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపు

ప్రజాశక్తి - పెద్దాపురం

పోలీసు శాఖలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా నేరాల అదుపుకు కృషి జరుగుతోందని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం పెద్దాపురం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ సిబ్బందికి ఎటువంటి నష్టాలు వాటిల్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విధి నిర్వహణలో పోలీసులకు ఎంతో సహకరిస్తోందన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. గంజాయి విక్రయిస్తున్న వారి వివరాలను సేకరించడంతోపాటు వారికి గంజాయిని సరఫరా చేస్తున్న ఏజెన్సీలను గుర్తిస్తున్నామన్నారు. గంజాయి సాగును పూర్తిగా నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నిరంతర ప్రక్రియగా తనిఖీలు నిర్వహించడం ద్వారా గంజాయిని పూర్తిగా నిరోధించవచ్చున్నారు. తాజాగా రాష్ట్రంలో వెలుగు చూస్తున్న సైబర్ నేరాలను అదుపు చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకులు, ఎటిఎం ద్వారా డబ్బులు పోగొట్టుకున్న బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్లో సైబర్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సతీష్ కుమార్, డిఎస్‌పి లతా కుమారి, సిఐలు రవికుమార్,దుర్గాప్రసాద్, ఎస్ఐ వి.సురేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

కంప్యూటర్ సెంటర్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వేట్లపాలెం రామకృష్ణ ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న శ్రీ వివేకానంద ట్యుటోరియల్‌లో కంప్యూటర్ సెంటర్‌కు పూర్వ విద్యార్థి మన్యం తేజ బుధవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. సెంటర్లో విద్యార్థులకు లాప్‌టాప్‌లు, సంస్థ ద్వారా చదివిన పిల్లలకు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పనకు తనవంతు కషి చేస్తానని మన్యం తేజ హామీ ఇచ్చారు. ఎన్నారై ఆర్మీల సుబ్బారావు, పూర్వ విద్యార్థి మన్యం తేజ వేట్లపాలెం రామకృష్ణ ధ్యాన మందిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి వివేకానంద శారదా మాత చిత్రపటాలు పలు వివేకానందుని గ్రంథాలు అందజేసి సత్కరించారు. కంటిపూడి బలరాం, గోపాలకృష్ణ, కంటిపూడి సుబ్బారావు, వల్లూరి వీరభద్రరావు, మోరంపూడి వెంకటేశ్వరరావు, మాసిన కామరాజు, కొండపల్లి నూకరాజు, నక్కా వెంకట రమణ పాల్గొన్నారు.

శ్రీనగర్ సదస్సుకు కమిషనర్

ప్రజాశక్తి-కాకినాడ

శ్రీనగర్‌లో రెండు రోజులపాటు జరగనున్న స్మార్ట్ సిటీల వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు కాకినాడ స్మార్ట్ సిటీ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ నాగ నరసింహారావు బయలుదేరి వెళ్లారు. బహిరంగ ప్రదేశాలను ప్రజలకు ప్రయోజనకరంగా సౌకర్యవంతంగా తీర్చిదిద్దడం, సైకిల్ 4 చాలెంజ్, ఈట్ స్ట్రీట్‌ల అభివృద్ధి వంటి అంశాలపై ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ స్మార్ట్ సిటీల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. ఆయా స్మార్ట్ సిటీలలో ఇప్పటికే అమలు జరుగుతున్న ఆయా అభివద్ధి పనులను వర్క్ షాప్ వేదికగా చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై సదస్సుకు హాజరయ్యే ఉన్నతాధికారులు దిశా నిర్దేశం చేయనున్నారు.

మత్స్యకారులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గోపులంక పుష్కర ఘాట్ వద్ద ఇటీవల నలుగురు విద్యార్థులు గల్లంతైన ఘటనలో మృతదేహాలను వెలికి తీసిన స్థానిక మత్స్యకారులకు కాకినాడ రూరల్ సి.ఐ. శ్రీనివాస్ రూ.5 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడారు. పని పట్ల మత్స్యకారులకు ఉన్న నిబద్ధతను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరంగి ఎస్.ఐ.రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, వంగలపూడి రామం తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకూ పాకిన బెట్టింగ్ మాఫియా

యువతే లక్ష్యంగా పందేలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్ మాఫియా ఇప్పుడు పల్లెలకూ విస్తరించింది. యువతే లక్ష్యంగా ఈ బెట్టింగ్ మాఫియా తన కార్యకలాపాలను సాగిస్తోంది. క్రికెట్ ప్రపంచ వరల్డ్ కప్ నేపథ్యంలో ప్రతి పల్లెలోనూ క్రికెట్ బెట్టింగ్ సాగుతోంది. చిన్నపాటి గ్రామంలోనూ రూ.లక్షల్లో బెట్టింగ్ సాగుతున్నట్లు సమాచారం. గతంలో పాకిస్తాన్, భారత్ మధ్య మ్యాచ్ మాత్రమే బెట్టింగ్ ఉండేది. అది కూడా పలానా జట్టు నెగ్గుతుందని స్థానికంగా కొంత మంది పందేలు కాసుకునేవారు. ఇప్పుడు దేశాలతో సంబంధం లేకుండా బెట్టింగ్ జరుగుతోంది. ఈ బెట్టింగ్ అంతా ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు సాగుతున్నాయి. టాస్ నుంచి ప్రారంభమైన బెట్టింగ్ చివరి బంతి వరకూ సాగుతోంది. ఒక ఓవర్‌కు ఎన్నిపరుగులు, ఎన్ని వికెట్లు అనే రీతిలో బెట్టింగ్ సాగుతోంది. ఇలా ఒక్క మ్యాచ్‌కే 20 నుంచి 30 రకాల్లో బెట్టింగ్ సాగుతోంది. బెట్టింగ్ నిర్వాహకులు స్మార్ట్‌ఫోన్లలోనే ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. బెట్టింగ్ అనంతరం డబ్బుల లావాదేవీలు ఫోన్‌పే, గూగుల్‌పే ఇతర ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా నిర్వహిస్తున్నారు. రూ.1000 నుంచి ప్రారంభమైన బెట్టింగ్ రూ.కోట్ల వరకూ వేసుకునే వెసులుబాటు ఉంది. కొంత మంది వెసులుబాటులో ఉన్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను సైతం వినియోగిస్తున్నారు. ఇందులో బంతి బంతికీ బెట్టింగ్ కట్టే అవకాశం ఉంది. దీని కోసం బెట్టింగ్ ఆడేవారు కొంత మొత్తాన్ని ముందుగానే జమచేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ఖాళీ అవ్వగానే మళ్లీ మరికొంత మొత్తాన్ని వేయాల్సి ఉంటుంది.



యువత పెడదారి

సరదాగా చేసుకున్న బెట్టింగ్ అలవాడు ఇది చివరకు వ్యసనంగా మారుతోంది. కొంత మంది యువత బెట్టింగ్‌ల కోసం అప్పులు చేస్తుండగా మరికొంత మంది చోరీల బాటపట్టి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈజీగా మనీ సంపాదించొచ్చనే ఆలోచనతో బెట్టింగ్ ఊబిలో కూరుకుపోతున్నారు. చివరకు కొంత మంది అప్పులు ఊబిలో కూరుకుపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా విద్యార్థులే ఈ వ్యసనానికి గురవుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో ప్రారంభించి చివరకు ఇళ్లల్లోనే చోరీలకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లలు. పోలీసులు అడపాదడపా దాడులు జరిపి చేతులు దులిపేసుకోవడం తప్ప పూర్తిస్థాయిలో బెట్టింగ్‌ను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఐజి, ఎస్‌పి తదితరులు

సిఎం పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజానగరంలో గురువారం సిఎం జగన్ పర్యటించనున్న దృష్ట్యా ఏర్పాట్లను ఏలూరు రేంజి డిఐజి జివిజి.అశోక్‌కుమార్, ఎస్‌పి పి.జగదీష్ బుధవారం పరిశీలించారు. దివాన్ చెరువు డివిబి.రాజు లే-అవుట్‌లో జరిగే ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సోదరుడు వైసిపి ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగ సమన్వయకర్త జక్కంపూడి గణేష్ పెళ్లి రిసెప్షన్‌కు సిఎం హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బివిబి.రాజు లే-ఔట్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ ప్రాంతాన్ని, రిసెప్షన్ ప్రాంతాన్ని, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట అడిషనల్ ఎస్‌పి (లా అండ్ ఆర్డర్) ఎం.రజని, అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, అడిషనల్ ఎస్‌పి(క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావ, డిఎస్‌పి డి.రామవర్మ ఉన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెరవలి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. మండలం ఉసులుమర్రులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారనానరు. అందరూ వినియోగించుకుని సంబంధిత వైద్యులతో వైద్యం చేయించుకోవాలన్నారు. ఊపిరితిత్తుల వైద్యులు మహేశ్వర్‌రెడ్డి, జనరల్ సర్జన్ పి.రవికుమార్, పిహెచ్‌సి వైద్యులు పి.తేజశ్రీ, ఎఎస్.కృష్ణవేణి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ ఎన్.రాజకుమారి సందర్శించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరమల్లు నాగలక్ష్మి, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, నాయకులు వీరమల్లు సత్యనారాయణ, రామడుగుల సూర్యనారాయణ, దవులూరి శ్రీనివాస్, ఎఎన్ఎంలు అక్కమ్మ, బి.జ్యోతికుమారి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్య గొంతు కోసిన భర్త

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భార్య నిద్రిస్తున్న సమయంలో ఆమెని మెల్కొల్పి వాగ్వావాదం పెట్టుకుని చాకుతో గొంతు కోసి పరారైన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొబ్బర్లంకకు చెందిన బత్తుల ప్రేమజ్యోతి(25)కి ఉండి మండలం ఆరేడు గ్రామానికి చెందిన బత్తుల గంటయ్యతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గంటయ్య డ్రైవర్ పనిచేస్తూ కుటుంబానికి పోషించుకుంటున్నాడు. నాలుగు నెలల క్రితం నుంచి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలు పెట్టాడు. ఈ బాధలు భరించలేక ప్రేమ జ్యోతి బొబ్బర్లంకలో పుట్టింటిలో ఉంటుంది. పెద్దల్లో సమక్షంలో ఈ విషయంపై పలుమార్లు తగువు పెట్టినా పరిష్కారం కాలేదు. వారం రోజుల క్రితం గంటయ్య బొబ్బర్లంక వచ్చి భార్య ప్రేమ జ్యోతితో సఖ్యంగా ఉంటానని చెప్పి నమ్మించాడు. అప్పటి నుంచి భార్యతో కలిసి బొబ్బర్లంకలోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారు జామున రెండు గంటలకు భార్యతో వాగ్వావాదం పెట్టుకున్నాడు. అనంతరం ఆమె గొంతును చాకుతో కోసి పరారయ్యాడు. ప్రేమ జ్యోతి మరిది కుసుమ నవీన్ వెంటనే ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరిది నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ తెలిపారు. నిందితుని కోసం గాలిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం ప్రత్తిపాడు రహదారిలో పులిమేరు వద్ద బుధవారం టిప్పర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పిఠాపురం మండలం కుమారపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై వెళ్తున్నారు. పులిమేరు వద్ద రోడ్డు మలుపులో టిప్పర్, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గొల్లపల్లి సుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వి.సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గూడ్స్ వ్యాన్ యూనియన్ నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అమరావతి మినీ గూడ్స్ వ్యాన్ యూనియన్‌కు సంబంధించిన వాహనాలకు లోడ్ కాకుండా అడ్డుకుంటున్న దుర్గ మినీ గూడ్స్ వ్యాన్ యూనియన్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బుధవారం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో అమరావతి మినీ గూడ్స్ యూనియన్ అధ్యక్షులు ఏడిద నాగరాజు ఫిర్యాదు చేశారు. ఈనెల 16 నుంచి తమ యూనియన్ వాహనాలకు సరుకు లోడు కాకుండా దుర్గ మినీ గూడ్స్ వ్యాన్ యూనియన్ వారు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో తమ ఉపాధికి ఇబ్బంది ఎదురవుతుందన్నారు. బుధవారం కూడా తమ యూనియన్‌కి చెందిన వ్యాన్‌లో ఆయిల్‌ను లోడ్ చేయగా దుర్గా మినీ గూడ్స్ వ్యాన్ యూనియన్ వారు దౌర్జన్యంగా అడ్డగించారన్నారు. దీంతో న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బైకు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెదపూడి

మోటార్ బైక్‌పై వెళుతూ యువకుడు పంటకాలువలో పడి మృతి చెందినట్లు పెదపూడి ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. పెదపూడి గ్రామానికి చెందిన ఇంజమూరి శ్రీను కుమారుడు సాయిరామ్ (22) పెదపూడిలో చేపల చెరువులు వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే సాయిరామ్ మోటార్ పై ఈ నెల 24న ఉదయం 8 గంటలకు పనికి వెళ్లాడు. తిరిగి రాత్రికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇంటి వద్ద వెదకగా ఆచూకీ లభించలేదు. బుధవారం పెదపూడి గ్రామంలోని పెద్దపాలెం వెళ్లే సత్రం వంతెన వద్ద పంట కాలువలో సాయిరామ్ మతదేహాన్ని గుర్తించారు. 24వ తేది రాత్రి సాయిరామ్ బైక్ పై చెప్పు ఢీకొట్టి పంట కాలువలో పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పెదబ్రహ్మదేవంలో అన్నదానం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెదబ్రహ్మదేవంలోని శారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అధ్యక్షుడు తోటకూర గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యుడు నువ్వుల వెంకటరాజు, టివివి.సత్యనారాయణ, నువ్వుల బాబ్జీ, సూర్య చంద్రరావు, తాడాల దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదానికి ఎపిటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న విజయవాడలో ఎపిటిఎఫ్-1938 తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా శాఖ పిలుపునిచ్చింది. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ కూడలిలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ ధర్నాను జయప్రదం చేయాలని ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం, మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.అప్పయ్యశాస్త్రి, జిల్లా అధ్యక్షులు పింగళి శ్రీనివాస్, మండల అధ్యక్షులు డేవిడ్ లివింగ్‌స్టన్, మండల ప్రధాన కార్యదర్శి ఎన్.గౌరీశంకర్, జి.శ్రీనివాస్, జి.తాతారావు, ముంగండి పద్మజ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

ప్రజాశక్తి-ఆలమూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఎస్‌సి వర్గీకరణపై ఇచ్చిన అన్ని హామీలను నిలబెట్టుకోవాలని, ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును అమోదించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము నారాయుడు డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఆమోదాన్ని కోరుతూ మంద కృష్ణ చేపట్టిన విశ్వరూప పాదయాత్రకు సంఘీభావంగా నారాయుడు బుధవారం మండలంలో పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పిఎసిఎస్ మాజీ చైర్మన్ వంటిపల్లి సతీష్, టిడిపి అమలాపురం వాణిజ్య సెల్ అధికార ప్రతినిధి సలాది నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బాధ్యత' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కడియం

'బాధ్యత' సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల బాబును అభినందించారు. కడియం జిల్లా పరిషత్ హై స్కూల్లో స్వీయ నిధులతో గిరజాల బాబు తన తండ్రి పేర ఏర్పాటు చేసిన శ్రీ గిరజాల కృష్ణారావు కళావేదికను వైసిపి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి చెల్లుబోయిన వేణు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందననాగేశ్వర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి తదితర ప్రముఖులు మాట్లాడారు. బాధ్యతా సేవాసంస్థ ద్వారా 15 ఏళ్లుగా 2,500 అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకొనడం గిరజాల బాబు సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా జానపద నృత్యం, లఘునాటిక పోటీల్లో ఇటీవల రాష్ట్ర స్థాయికి ఎంపికైన కడియం హై స్కూల్ విద్యార్థినులను సన్మానించారు. అలాగే బాధ్యతా సేవాసంస్థ 15వ వార్షికోత్సవ సందర్భంగా సంస్థ తరపున ప్రముఖ సినీ కళాకారుడు జిత్ మోహన్ మిత్రాకు సాంస్కృతిక వారధి పురస్కారం, ప్రముఖ నాటక కళాకారిణి కర్రి రత్నకుమారికి కళారత్న పురస్కారం, భారత షిప్ యార్డ్ మాజీ కమాండర్ ఆదిమూలం చినవెర్రియ్యకు సాహస సారధి పురస్కారాలను అందించారు. తొలుత మిథున్‌రెడ్డికి వేమగిరి జాతీయ రహదారి కూడలి వద్ద చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో పూలతో ఘనంగా స్వాగతం పలికారు. కడియం చేరుకున్న మిథున్‌రెడ్డి, పలువురు ప్రముఖులు రామదాసు పేపర్ మిల్లు సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన గోశాలలో రివర్ కెనాల్ వ్యూ ను ప్రారంభించారు. అలాగే జగనన్న 'బాలల ఆనంద వేదిక' ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం 'ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ గిరజాల రామకృష్ణతులసి, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, మాజీ ఎంఎల్‌ఎ రౌతు సూర్యప్రకాశరావు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, పార్టీ నాయకులు యాదల స్టాలిన్, భీమిరెడ్డి నాగేంద్ర, పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు, గిరజాల నాగేశ్వరరావు, గిరజాల బాబ్జి, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



కళావేదికను ప్రారంభిస్తున్న మిథున్‌రెడ్డి తదితర ప్రముఖులు

పి.మల్లవరం హైస్కూల్‌కు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి- తాళ్లరేవు

పి.మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఉంగరాల రవీంద్ర (పెదబాబు) రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పివి.శ్రీనివాసరావుకు రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం అందించారు. రూ. 50 వేల డిపాజిట్ ద్వారా వచ్చే వడ్డీతో పదో తరగతిలో మూడు, నాలుగు, ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారంగా అందజేయాలని ఆయన కోరారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15న అందజేయమని చెప్పారు. ఇదివరకే వనిమిసెట్టి నాగేశ్వరరావు కుమారుడు వనిమిశెట్టి శేషు రూ.లక్ష విరాళాన్ని హైస్కూల్ హెచ్ఎంకు అందజేశారు. ఆ విరాళంపై వచ్చే వడ్డీతో పదో తరగతిలో ఒకటి, రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేయమన్న సంగతి విదితమే. ఈ కార్యక్రమంలో పెదబాబు కుటుంబ సభ్యులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుభ, బాబీ, మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది బి.రాజరాజేశ్వరి, కుమార్, సత్యనారాయణ, సుబ్బలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వెంకన్నకు రూ.2.36 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో వెంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.2,38,728 ఆదాయం సమకూరింది. 34 రోజులకు సంబంధించి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తీపర్రు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ పర్యవేక్షణ అధికారి ఎం.రామయ్య సమక్షంలో లెక్కించారు. ఇరాన్ కరెన్సీ నోట్లు 47, రూ.2వేలనోటు ఒకటి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంబరంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వేట్లపాలెం భేతాళ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన ఉత్సవంలో పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బేతాళ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో నాయకులు మాజీ ఎంపిపి కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ల రామకృష్ణ, గుణ్ణం సూర్యారావు, కొండపల్లి సూరన్న చౌదరి, ఆలయ కమిటీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడక స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. స్థానిక మెయిన్ రోడ్డులో సామంతుల చిన్నారావు నూతనంగా ఏర్పాటు చేసిన డైరీ మిల్క్ ప్రొడక్ట్స్‌ను ఎంఎల్‌ఎ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ చేయూత పథకం ద్వారా చిరు వ్యాపారులకు ప్రభుత్వం అనేక విధాల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. నిరుద్యోగులు ఉపాధిపై దృష్టి సారిస్తే ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి అలమండ చలమయ్య, నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, టి.రాంబాబు, ఎం.నాగేశ్వరరావు ఉన్నారు.

పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని తిరుమాలి గ్రామానికి చెందిన భూదాన భూమి లబ్ధిదారులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ నాయకుడు కొసిరెడ్డి గణేష్ మాట్లాడుతూ తిరుమాలిలో సర్వేనెంబర్ 79లో 2.14 ఎకరాలు, సర్వే నెంబర్ 80లో 9.19 ఎకరాల భూమిని 1955లో భూస్వాములు భూదాన బోర్డుకు ఇచ్చారన్నారు. ఆ భూమిని భూమిలేని 44 మందికి పట్టాలు ఇచ్చారన్నారు. ఈ భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.లక్ష్మి, టి.అజ్జమ్మ, రాజ్యాల సత్తిబాబు, పి.నల్లబాబు, ఎస్.అప్పలరాజు, బి.పార్వతి, బి.జయమ్మ, బి.చిట్టెమ్మ ఉన్నారు.

చాగల్లులో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలోని సచివాలయం-5 పరిధిలో బుధవారం హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ కోసం వృద్ధులు నానా ఇబ్బందులు పడేవారన్నారు. సిఎం జగన్ పాలనలో సచివాలయ సిబ్బంది ద్వారా వాలంటీర్లు నేరుగా ఇంటికి వెళ్లి పింఛను, రేషన్ అందిస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పోసిన శ్రీలక్ష్మి, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, మండల ఉపాధ్యక్షులు జుజ్జువరపు రామచంద్రరావు, నాయకులు గొంద్రోతు సురేంద్ర కుమార్, జుట్ట ఏడుకొండలు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ పాషా, వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సూక్ష్మ కళాఖండం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళా ఖండాల శిల్పి తాళాబత్తుల సాయి చేతిలో మరో బంగారు సూక్ష్మ కళా ఖండం రూపుదిద్దుకుంది. స్వర్ణాభరణాల తయారీలో ప్రసిద్ధికెక్కిన సాయి చేతిలో రూపుదిద్దుకున్న సూక్ష్మ కళాఖండాల ద్వారా అయినా రాష్ట్ర, జాతీయ, 'అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా తాను బంగారు రాకింగ్ చైర్ సూక్ష్మ కళాఖండం రూపొందించానన్నారు. 0.900 మిల్లీగ్రాముల బరువు కలిగిన బంగారంతో 5 మిల్లీమీటర్లు ఎత్తు, 10 మిల్లీమీటర్లు వెడల్పుతో దీనిని రూపొందించానన్నారు. దీన్ని తయారు చేసేందుకు తనకు మూడు గంటలు సమయం పట్టిందన్నారు.



టిడిపి, జనసేన ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ

దేవరపల్లి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి, జనసేన ఆధ్వర్యంలో దేవరపల్లిలో బుధవారం కాగడాల ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఈ శాంతి ర్యాలీ నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు మాట్లాడారు. చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి వార్వలేక అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వైసిపి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఈ ర్యాలీని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గోపాలపురం నాయకులు దొడ్డిగర్ల సువర్ణరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, టిడిపి నాయకులు గన్ని కృష్ణ పాల్గొన్నారు

పలువురికి ఎంఎల్‌ఎ వేగుళ్ల పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం మండలాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. మాచవరంలో పోలినాటి లక్ష్మి, అర్తమూరులో మాజీ ఉప సర్పంచ్ కర్రి కనకసుందరరెడ్డి కుటుంబ సభ్యులను ఎంఎల్‌ఎ పరామర్శించారు. వారికి సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే అర్తమూరు గ్రామంలో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న చిర్ల రామన్నకాపు, చిర్ల రామచంద్రారెడ్డి, చిర్ల ఆదిరెడ్డిలను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

కలశాలతో మహిళల ఊరేగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

మండల కేంద్రమైన గండేపల్లిలో మరిడమ్మ గుడి వీధిలో 13వ విజయదశమిని పురస్కరించుకుని, దేవీ నవరాత్రులు, ఎరకారెడ్డి వెంకట్ రెడ్డి సుజాత దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, గోలి బాబూరావు ఇంటి సమీపంలో నిర్వహించిన దేవీ నవరాత్రులు, ఆదివారం నుండి బుధవారం వరకు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంపాటి రాంబాబు, మాసిన సుబ్బారావు, ఇప్పర్ల సురేష్, గడ్డం సురేంద్ర, వీరమల్ల మోహన్ రంగ, పసలపూడి వెంకటరావు, వీరమల్ల సూరిబాబు పాల్గొన్నారు.

